

అది ఎవరు

**మిల్కీని దింపేసి జూబ్లీ బస్టాండ్ నుంచి బయటికి వెళ్తున్న కిడ్నాపర్ కారును పోలీసులు పట్టుకొన్నారు. ‘ఏయ్.. దిగు’ హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి గద్దించాడు. భయం భయంగా కారు దిగాడు డ్రైవర్ కమలాకర్. ‘మూతికి మాస్క్ తియ్యి అన్నాడు’ రామస్వామి. మాస్క్ తీసిన డ్రైవర్.. రామస్వామితో ‘సార్.. నాకు ఏమీ తెలీదు. నేను ఎయిర్‌పోర్ట్‌లో ఒకరిని దింపేసి ట్యాంక్‌బండ్ రూట్‌లో తిరిగి వస్తుండగా ఇద్దరు అమ్మాయిలు.. నా కారును ఆపారు. స్పృహ కోల్పోయిన ఈమెను జూబ్లీ బస్టాండ్‌లో దించేయాలంటూ నాకు రూ. 5 వేలు ఇచ్చారు’ చెప్పాడు డ్రైవర్.**

# సైకో ట్విన్స్

‘ఇద్దరు అమ్మాయిలా? ఎవరు?’ ఆత్రుతగా ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్ రుద్ర. ‘నాకు తెలియదు సార్. ఎవరో బుర్ఖా వేసుకొన్న పాపతో వాళ్లు ఉన్నారు. బస్టాండ్‌కు వచ్చేవరకూ వీడియో కాల్‌లోనే ఉన్నారు. జూబ్లీ బస్టాండ్ బిల్డింగ్ మీద ఫ్లెక్సీని వీడియో కాల్‌లో చూపించాలన్నారు. తాము ‘ఓకే’ అనిచెప్తే అమ్మాయిని అక్కడ విడిచిపెట్టు. ‘నో’ అంటే తిరిగి ట్యాంక్‌బండ్ దగ్గరికి తీసుకొచ్చేసెయ్ అన్నారు. ఆ తర్వాత వాళ్లు ఓకే అనగానే అప్పటికే స్పృహలోకి వచ్చిన ఈ అమ్మాయిని దించేశా. అలా తిరిగి వెళ్తుండగా ఇదిగో మీరు పట్టుకొన్నారు’ అంటూ డ్రైవర్ చెప్పాడు. ‘బాబాయ్.. వీడియోకాల్ చేసిన నంబర్ లైవ్ లొకేషన్ ట్రేస్ చేయండి’ అంటూ రామస్వామిని పురమాయించిన రుద్ర.. ‘పద.. కారును ట్యాంక్‌బండ్ మీద.. మిల్కీ ఎక్కిన చోటుకు త్వరగా తీసుకెళ్లు’ అంటూ కమలాకర్‌కు చెప్పాడు.

పది నిమిషాల్లో కారు ట్యాంక్‌బండ్‌కు చేరింది. మిల్కీ కారు ఎక్కిన ప్రదేశంలో ఎవరూ లేరు. దీంతో అప్పటికే తనను ఫాలో అవుతున్న సిబ్బందితో కమలాకర్‌ను స్టేషన్‌కు తీసుకువెళ్లమన్నాడు రుద్ర. ‘సార్.. నేనెందుకు స్టేషన్‌కు? నాకే పాపం తెలియదు’ అన్నాడు కమలాకర్. ‘మిస్టర్ కమలాకర్. ఇదో సైకో కిడ్నాపర్ కేసు! తెలిసో, తెలియకో మీరు కూడా ఇందులో ఇన్వాల్వ్ అయ్యారు. సో.. ఫార్మాలిటీస్ కోసం స్టేషన్‌కు రావాల్సి ఉంటుంది’ చెప్పాడు రుద్ర. ‘సార్.. మా అమ్మకు పక్షవాతం. మంచం నుంచి లేవలేదు. అన్నం, మందులు ఇవ్వాలి. ఇదిగో నా విజిటింగ్ కార్డు, ఫోన్ నంబర్. మీరు రమ్మన్నప్పుడు వస్తా. ప్లీజ్’ అంటూ బతిమిలాడాడు కమలాకర్. తల్లి గురించి చెప్పడంతో కమలాకర్ చేతిలోని ఆ విజిటింగ్ కార్డు తీసుకొన్న రుద్ర.. అతణ్ని పంపించివేశాడు. రెండుగంటల్లో స్టేషన్‌కు రావాలని చెప్పాడు. ఆ తర్వాత ట్యాంక్‌బండ్ మీద ఉన్న సీసీటీవీ ఫుటేజీని తెప్పించుకొన్న రుద్ర.. ఆ బుర్ఖాలోని సైకోతో ఉన్నది శిశిర, వసంత అని గ్రహించాడు. అప్పటికే సమయం సాయంత్రం 6 గంటలు కావొస్తున్నది. ట్యాంక్‌బండ్‌మీద ఉన్న ఓ స్ట్రీట్‌లైట్ దగ్గర సైకో ఓ చీటీని రాయికి చుట్టి పడేసినట్టు రుద్ర ఫుటేజీలో గమనించాడు. వెంటనే అక్కడికి వెళ్లి దాన్ని చదవడం ఆరంభించాడు.

‘రుద్రా! నువ్వు చాలా తెలివైనవాడివి. భలే ఆలోచిస్తున్నావ్.. అన్నట్టు.. నీకు జనరల్ నాలెడ్జీ కూడా ఎక్కువేనటగా. సరే అయితే.. ఇప్పుడు శిశిర, వసంతను నేను ఒకేసారి విడిచిపెట్టాలంటే, నువ్వు రాత్రి 9 గంటలలోపు నేను అడిగే ప్రశ్నలకు సమాధానాల్ని చెప్పాలి. మొదటి ప్రశ్న.. మరే ఇతర సంస్థలు ఇవ్వనంతగా విదేశాల్లో మన భారతీయులకు అత్యంత ఎక్కువగా ఉద్యోగాలు ఇచ్చిన గ్రూప్ అది. వాళ్లు మన హైదరాబాద్‌లో ఓ మాల్‌ను కూడా స్టార్ట్ చేశారు. సరిగ్గా రాత్రి 9 గంటలకు ఆ మాల్ ఫస్ట్ ఫ్లోర్‌లోకి రావాలి. అక్కడ నేను ‘ఇండియా కాకుండా హిందీ అధికార భాషగా ఉన్న దేశం పేరుతో ఉన్న డ్రింక్‌ను తాగుతూ ఉంటా’.. తెలివైనవాడివైతే వచ్చి నన్ను పట్టుకో. 9 గంటలకు ఒక్క నిమిషం ఆలస్యమైనా.. నేను వెళ్లిపోతా. నేను వెళ్లిపోయిన 10 నిమిషాల్లో శిశిర, వసంత శవాలుగా మారిపోతారు. యువర్ టైమ్ స్టార్ట్స్ నౌ’ అంటూ ఆ చీటీలో రాసి ఉంది.

‘బాబాయ్.. విదేశాల్లో భారతీయులకు ఎక్కువగా ఉద్యోగాలు ఇచ్చిన గ్రూప్ లులూ. కూకట్‌పల్లిలోని లులూ మాల్ ఫస్ట్‌ఫ్లోర్‌కే ఆ సైకో రాబోతున్నాడు. మన వాళ్లను అక్కడ అలర్ట్‌గా ఉండమనండి. ఫిజీ దేశంలోనే హిందీ ఓ అధికార భాషగా ఉంది. అంటే ఆ సైకో తాగబోయే డ్రింక్ పేరు ఫిజీ. ఈ అప్‌డేట్ కూడా అందరికీ ఇవ్వండి. శిశిర, వసంతను కాపాడటమే కాదు.. మనం ఎలాగైనా ఆ సైకోను పట్టుకోవాలి’ అంటూ ఆదేశించాడు రుద్ర. పోలీసు సిబ్బంది అందరూ లులూ మాల్‌కు ప్రయాణమవుతుండగా అప్పటికే అక్కడికి వచ్చిన హనీ, మిల్కీ తాము కూడా వస్తామన్నారు. సరేనన్న రుద్ర.. కమలాకర్‌ను కూడా లులూ మాల్‌కు రమ్మన్నాడు. ‘సార్.. కమలాకర్ ఎవరు?’ అడిగింది మిల్కీ. ‘మిమ్మల్ని జూబ్లీ బస్టాండ్‌లో దించిన డ్రైవర్’ సమాధానమిచ్చాడు రుద్ర. ఇంతలో లులూ మాల్ వచ్చేసింది. అప్పటికే సమయం రాత్రి 8.30 గంటలు కావొస్తున్నది.

మాల్‌లో పోలీసులు అలర్ట్‌గా ఉన్నారు. ఇంతలో అక్కడికి వచ్చిన కమలాకర్‌ను చూడగానే.. ‘సార్.. వీడే సైకో. మమ్మల్ని కిడ్నాప్ చేసింది వీడే. మమ్మల్ని బంధించిన ప్లేస్‌లో ఓసారి బుర్ఖా తీస్తుండగా మేం చూశాం’ కంగారుగా చెప్పూపోయారు హనీ, మిల్కీ. ఒక్కసారిగా షాకయ్యారు రుద్ర అండ్ టీమ్. ‘ఇతను సైకో అయితే, మరి ట్యాంక్‌బండ్ మీద సీసీటీవీ ఫుటేజీలో శిశిర, వసంతతో ఉన్న బుర్ఖా పాప ఎవరు? ఈ పజిల్ చీటీలు పెట్టింది ఎవరు??’ రుద్ర మెదడు వేడెక్కిపోయింది.

ఇంతలో సమయం తొమ్మిదైంది. దూరంగా బెంచీమీద కమలాకర్ కూర్చున్నాడు. చేతిలో ఫిజీ ఉంది. రుద్ర పక్కన కమలాకర్ ఉన్నాడు. అతని చేతిలోనూ ఫిజీ ఉంది. ఇద్దరి డ్రెస్సు, షూలు, క్రాప్ ఇలా అన్నీ సేమ్. వాళ్లను చూసిన రుద్రకు కాళ్ల కింద భూకంపం వచ్చినంత పనైంది. వాళ్లిద్దరూ ఐడెంటికల్ ట్విన్స్ అని అర్థం చేసుకోవడానికి రుద్రకు ఎంతో సమయం పట్టలేదు. వెంటనే పోలీసులు అందరూ సైకో ట్విన్స్‌ను రౌండప్ చేశారు. ఇద్దరినీ అక్కడికక్కడే అరెస్ట్ చేసిన రుద్ర.. వారితో ‘మీరిచ్చిన టైమ్‌లోపు నేను మిమ్మల్ని కనిపెట్టాను. శిశిర, వసంత ఎక్కడ?’ అంటూ ప్రశ్నించాడు. ‘శిశిర, వసంత సేఫ్. అయితే, మా ఇద్దరిలో కారు డ్రైవర్‌గా జూబ్లీ బస్టాండ్‌కు వచ్చింది ఎవరో చెప్తే.. వాళ్లను ఎక్కడ దాచిపెట్టామో చెప్తాం’ అంటూ సైకోలు రుద్ర ముందు చివరి పజిల్ పెట్టారు. ‘మీ చేతిలోని ఫిజీ బాటిల్స్ ఇస్తే.. చెప్తా’ అంటూ రుద్ర వెంటనే బదులిచ్చాడు. కొద్ది నిమిషాల్లోనే జూబ్లీ బస్టాండ్‌కు డ్రైవర్‌గా వచ్చిన సైకో ఎవరో రుద్ర కనిపెట్టాడు. దీంతో శిశిర, వసంత ఎక్కడ ఉన్నారో సైకో ట్విన్స్ చెప్పేశారు. ఇంతకూ, రుద్ర జూబ్లీ బస్టాండ్‌కు డ్రైవర్‌గా వచ్చిన సైకో ఎవరో ఆ ఫిజీ బాటిల్స్‌ను బట్టి ఎలా కనిపెట్టినట్టు? ■

**సమాధానం.. 28వ పేజీలో**

... రాజశేఖర్ కడవేర్గు

